# విడివడని బంధం

కౌసనం మహేశ్వరరావు

నేను రోజూ అదే బస్ స్టాపుదగర బస్ కోసం వెయిట్ చేస్తుంటాను. సరిగ్గా అతనూ అదే సమయానికి అదే బస్ స్టాపుదగ్గరకు వస్తూంటాడు. నేను వెళ్ళడం ఆలశ్యమయినా అతను నేను వెళ్ళేవరకు బస్‌లు ఖాళీగావున్నా ఎక్కక నేను వెళ్ళేవరకు ఎదురుచూస్తూంటాడు. అతనికి నా మీద 'ఏదో' వుండి ఉంటుందనుకొన్నాను నేను మాత్రం అతనికోసం ఎదురుచూడక బస్ రాగానే వెళ్ళిపోయేదాన్ని. ఆ సమయంలో అతనేం చేసేవాడో పాపం, కొంత బాధపడి వుండేవాడు. సాధారణంగా నాకంటే ముందుగనే ప్రతిరోజూ అతనక్కడకు వస్తూండేవాడు. ఇదంతా నేను గమనిస్తూనే ఉన్నాను. అతను కూడా నేను గమనించాలని ప్రయత్నిస్తున్నాడని తెలుసుకొన్నాను. నేను అతన్ని చూచీచూడనట్లు పోతుండేదాన్ని. అతను ఎప్పుడు చక్కా ముస్తాబై ఉండేవాడు. నెక్టయ్ కట్టుకొనేవాడు, రకరకాల టోపీలు ధరిస్తూ వుండేవాడు నన్ను ఆపాదమస్తకం పరిశీలించందే అతను తృప్తిపడేవాడుకాదు కాబోలు. నేను ఇవన్నీ చూచీ చూడనట్లుగా వుండేదాన్ని. అతనంటే నాకెందుకో ఏదో ఒకవిధమైన 'ఇది' కలుగుతూ వచ్చింది అతనీ అవస్థ అంతా ఎందుకు పడుతున్నాడో నాకు చూచాయగా అర్థం అవుతూవచ్చింది. బస్ ఎక్కిన తరువాత సరిగ్గా నాకెదురు సీటులో కూర్చొనేవాడు. అప్పుడుకూడా నాయందే అతని దృష్టి. చూచేవారేమైనా అనుకొంటారనుకొని గ్రహించి అప్పుడప్పుడు ఏమీ ఎరగనట్లు, నంగనాచివలె ప్రవర్తించేవాడు. నేను అతనికంటే ముందుగనే బస్ దిగి పోయేదాన్ని. నేను దిగిపోతూంటే అతని మొహంలో కొంత మార్పు వచ్చినట్లు తేలిగ్గా పరిశీలించినవారికెవరికైనా కనిపించేది. బస్ కదలినతరువాతకూడా నేను కనుమరుగైపోయేవరకు చూస్తూండేవాడు. కళ్ళకైనా బాధ కలుగుతుందని ఆలోచించేవాడు కాదు. అతనికి నాయందుండే 'ఇది' ఎంతవరకు నిజమైందీఅని, అసలు నేనంటే ఎందుకో అంత 'ఇది'అని అనుకొనేదాన్ని.

అతను ఏదో ఆఫీసులో పనిచేస్తున్నట్టుగా అతని చేతిలోని ఫైళ్ళనుబట్టి అనుకొన్నాను. బహుశా అతను నన్ను పంతులమ్మగా ఊహించి ఉంటాడని అనుకొంటాను.

ఒకనాటిరాత్రి సినిమాకు నేనొక్కదానినే వెళ్ళడం సంభవించింది. అతను జ్యోతిష్కుడులాగున్నాడు, 'నాకంటే' ముందుగనే అతను హాల్లో ప్రత్యక్షమైనాడు. ఇంకొక చిత్రం ఏమిటంటే నేను వెళ్ళే క్లాసుకూడా అతనికి తెలిసిపోయింది. నేను హాల్లోకి వెళ్ళడంతోనే నన్ను చిరునవ్వుతో ఆహ్వానించిందతడే. సీటేవీ ఖాళీగా లేవు. సరిగ్గా అతని ప్రక్కనే ఒక సీటు ఖాళీగావుంది. ఇంకా సినిమా బిగిన్ చెయలేదు. స్లయిడ్స్ వేస్తున్నారు తిరిగి పోవాలనుకొన్నాను. నా బలహీనతకు నాకే నవ్వు వచ్చింది. ఎందుకు పోవాలి తిరిగి నేను? వెంటనే ఒక ప్రశ్న ఎదురయింది. తిరిగి పోలేకపోయాను. అప్రయత్నంగా అతని ప్రక్క ఖాళీ కుర్చీలో కూర్చుండిపోయాను. అతను ఒక్కసారి నెక్టయి వదులు చేసుకొన్నాడు. ఒక చిలిపి హాసం చేశాడు, నావంక ఓరగా చూస్తూ. ఈ ఒక్క సీటు ఖాళీకూడా అతని ప్రభావమేనని తెలుసుకోవడానికి ఎక్కువసేపు పట్టలేదు. నాకోసం రిజర్వుచేసి సీటును కాపలాకాచినందుకు ఒక చిరునవ్వుతో అతను పడిన శ్రమకు సానుభూతి చూపాను. పాపం ఎందుకీయన కింత అవస్థ? ఆయనెవరు? నేనెవరిని? ఒక అపరిచిత వ్యక్తికోసం! ఆ అపరిచిత వ్యక్తికోసం...ఆ వ్యక్తిఅంటే అతని కెందుకీ 'ఇది'? ఇవే ప్రశ్నలు, ఇవే ఆలోచనలు. సినిమా మొదలుపెట్టారు. సినిమా చూస్తున్నానేగాని ఆలోచనలన్నీ అతన్ని గురించే. అతనుకూడా సినిమా చూస్తున్నట్లులేదు. అతని దృష్టి అంతా నామీదే. నాచేతి రుమాలా అతని కుర్చీలో ఎలా వెళ్ళిపడిందో ఏమో. అతను నా చేతి రుమాలునిస్తూ అన్నాడు. 'ఇదిగోనండీ మీ చేతిరుమాల్'

'ధన్యవాదాలు' నేను ప్రతిఫలం ముట్టచెప్పాను.

'ఇంతమాత్రానికే' అతను నవ్వుతూ అదోలా చూస్తూ అన్నాడు.

'నేను నవ్వి ఊరుకొన్నాను. అతనే మళ్ళీ ప్రస్తావన ప్రారంభించాడు.

'మిమ్మల్నెక్కడో చూచినట్లుందే.... అవును రోజూ బస్ స్టాపుదగర'

మాటాడితే నా సామ్యం పోతుంది గనుక అవునన్నాను.

మీరేం చేస్తుంటారు? అతని ప్రశ్న.

బడి పంతులమ్మపని, నా జవాబు. మా సంభాషణ ఏ ఆటంకం లేకుండా సాగిపోతుంది. సినిమా దాని దారిన అది నడుస్తున్నది.

మీరేం చేస్తుంటారు? నా ఎదురుప్రశ్న.

నేను సెక్రటేరియట్‌లో సూపరింటెండ్‌ను.

మా ఇద్దరిభావాలు ఒకేదారిన ఉన్నాయనుకొన్నాను. నేనంతి సాహసించడానికి జీవితపు గతిచరిత్రే కారణం. నన్ను మనసారా ప్రేమించినవారిని వివాహం చేసుకోవడానికి నా మనస్సు తహతహలాడుతున్నది. మా అమ్మ వాంఛకూడా అదే. సమాజం నా వివాహ విషయంలో ఘోర అన్యాయం చేసింది. పూర్వజన్మ సుకృతమని తృప్తిపడక తప్పిందిగాదు. మా కనుకున్న వారెవరూ మాపైపడిన విపరీత అన్యాయపు విపత్తును గురించి కొంచెమయినా సానుభూతి చూపినవారు లేరు. అదంతా చెప్పడం ఇప్పుడు అప్రస్తుతమనుకొంటాను.

అతనిజవాబు నాకు తృప్తిని కలిగించింది. అతని సంభాషణ, అతని చూపులు అవన్నీ నాకోసమేననీ చెప్తున్నాయి.

'నేను చాలారోజులుగా మిమ్మలను చూస్తున్నాను. మీరంటే నాకెందుకో 'ఇది' కలిగింది. మీకు చెప్పడానికి నాకు సిగ్గు, భయమూ కలిగినా ఇప్పుడు సాహసించి చెప్తున్నాను. ఎన్నోసార్లు చెప్పాలనుకొన్నాను. చెప్పలేకపోయాను. అయినా మీకు నాయందు ఎలాంటి అభిప్రాయముందో నేను గ్రహించలేకపోయాను' ఆయన యిక చెప్పలేకపోయారు.

నాకు సిగ్గు ముంచుకొచ్చింది. అప్రయత్నంగా నాచేయి అతని చేతిలోకి వెళ్ళింది. నేనేమీ చెప్పలేకపోయాను. నా వలిగిన సింధూరం తిరిగి పుష్పిస్తుంది. నా ఆశలు ఫలిస్తాయి. ఇది నిజమేఅయితే నాకంతకంటే కావలసిందేముంది? కాని కలఅయితే ఘోరశిక్షను కావలసి వస్తుంది. ఏదో ఉద్రేకంలో అంటున్నారనే అనుమానం నాకు

# ★ విడివడని బంధం ★

ఎదురయింది. 'నిజంగా నే...మీరిది మనఃపూర్వకంగా అంటున్న మాటలేనా? లేక ఏదో ఉద్రేకంలో అంటున్నారా?' నేను సూటిగా జంకూ గొంకూ లేక అడిగాను. 'అలా పార్కుకుపోయి మాట్లాడుకుందాం రండి. మీ కిష్టమయితే వివరంగా మాటాడుకొందామన్నారు. నేను సరేనన్నాను. ఇద్దరం పార్కుకి వెళ్ళాం. పార్కులో గడ్డి తిన్నపై కూర్చుంటూ 'త్రికరణ శుద్ధిగా చెబుతున్నాను. ప్రపంచం తల్లక్రిందులైనా నా నిర్ణయం మారదు. మీకు ఇష్టమయితే... మీ అంగీకారమే తరువాయి...ఇప్పుడు నేను మా వాళ్ళకు కొంతదూరంలో ఉంటున్నాను. వారి భావాలతో నేను ఏకీభవించలేకపోయాను. దాదాపు వారికీ నాకూ సంబంధం చాలా దూరంలో వుంది. ఇంక నాకెలాంటి అడ్డంకులూ లేవు' అతను ఆవేశంతో చెప్పాడు.

అతను చాలా బాధలను అనుభవించాడనుకొన్నాను. అతని ఆవేదన క్రింద నలిగిన గాథ ఏమిటో తెలుసుకోవాలనుకున్నాను. కాని చెప్పమని సాహసించి అడగలేక 'మెల్లగా అన్నాను.' కాని నా కథ వింటే మీరు ఇందుకు ఇష్టపడరనుకుంటాను.

ఆకాశాన కారుమబ్బులు నిప్పులు క్రక్కడం మొదలెట్టయి. వర్షం వచ్చే సూచనలు స్పష్టంగా కనుపిస్తున్నాయి. నా కథను అతనికిప్పుడే చెప్పడం మంచిది కాదని కాబోలు ప్రకృతే ఇలా కట్టడి చేస్తున్నదా అనిపించింది. తుంపరగా చినుకులు పడడం ప్రారంభించాయి.

'ఇకపోదాం ... నా రూముకి వెళ్దాం అభ్యంతరం లేకపోతే' అతనన్నాడు.

'నేను మౌనంగా లేచాను. అతనే ఒక ఆటోరిక్షా మాట్లాడాడు. అచేతనంగా దానిలోని కెక్కాను. అతని రూముకు వెళ్ళకూడదనుకొన్నాను. అంత త్వరగా ఒక అభిప్రాయానికి వచ్చేయడం భావ్యం కాదనుకొన్నాను. 'రేపు సెలవేగా, మా ఇంటికి రండి. తప్పక...మా అమ్మగారికి పరిచయం చేసాను. ఆమెకు కూడా ఈ విషయం తెలిస్తే సంతోషిస్తుంది' అన్నాను నేను మెల్లగా.

అతనేమీ అభ్యంతరం చెప్పలేదు. 'సరే' అని మాత్రం అన్నాడు. ఇంటి అడ్రసు అడిగి రిక్షాను పోనిచ్చాడు.

ఆటోరిక్షా మా ఇంటిముందు ఆగింది. నేను లేస్తూ అన్నాను. 'మీరు రేపు తప్పక వస్తారా? ఎదురుచూస్తుంటాం' అతను సరే తప్పక వస్తానన్నాడు. నేను...దాన్నిమనాలో...ఆనందపారవశ్యంతో మత్తెక్కినదానలా తూలుతూ ఇంటోకి వెళ్ళాను. అతను వెళ్ళిపోయాడు.

అతని మాటలెంతో మృదువుగా ఉన్నాయి. అతని మాటల్లో ఎంత సత్యం ఉట్టిపడుతుంది. ఏమాత్రం తొందరపాటు లేదు. ప్రేమపాశాల నేమాత్రం వల్లించలేదు. నా స్థానాన్ని చెప్తే దూరదృష్టిగలవారికా నా సవికత ఇట్టే అర్థమవుతుంది. ఇతని స్థితి నా స్థితి అంతేననుకొంటాను.

నేను భోజనం చేస్తూ మా అమ్మతో ఈ విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పాను. ఆమె ఆనందించింది. కాని ఒక సందేహాన్ని గూడ వెలిబుచ్చింది. 'ఇదంతా నిజమేనంటావా? ఉద్రేకంలో ఏవో బంగారు కొండలు చూపిస్తారు. అనంత ఆశలు కల్పిస్తారు. చివరికి నట్టేట్లో ముంచేస్తారు. జాగ్రత్తగా ఇలాంటి విషయాలను ఆలోచించి గాని ఒక నిర్ణయానికి రావడానికి వీలులేదు. బాగా ఆలోచించు అమ్మా... నేను కోరేది కూడా అదే......ఈపాటికి హాయిగా పిల్లతో అత్తగారింటివద్ద ఉండవలసినదానవు... పాపిష్టి కట్నాల ఎరకు తట్టుకోలేక నీ ఆనందాన్ని నీకు అందించలేకపోయాం. బండ్లు ఓడలవుతాయి ఓడలు బండ్లవుతాయి. అలాగే మన స్థితి అయింది కాబట్టి ఆ భారం నీమీదపడింది. అనూహ్యమైన గండ్రగొడ్డలి పెట్టు నీమీద పడింది. ఏంచేస్తాం గతాన్ని మరచి ముందుకు సాగడంలోనే ముక్తి. లేకపోతే ఎన్నాళ్ళిలా చింతతో బాధపడగలం. ఈ వయస్సులో నాకు ఇంతకన్నా కావలసిందేముంది తల్లీ. జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికిరా.' నా తల్లి కన్నీరు కార్చింది. అవి ఆనంద బాష్పాలో, దుఃఖబాష్పాలో చెప్పలేను. వణుకుతున్న హస్తాలతో నా తల నిమురుతూ అన్నది అమ్మ మళ్ళీ 'మరి గతాన్ని ఆయనకు చెప్పావా? అది విన్న తరువాత వెనుకాడితే ...ఏం చెయ్యగలం. చెప్పకపోతే మోసం చేసినట్లవుతుంది. అమ్మాయ్ రేపు వస్తారన్నావుగా తప్పక చెప్పు. నా గతాన్ని కప్పిపుచ్చకుండా ఉన్నదంతా చెప్పేయ్.

'సరేనమ్మా అలాగే చేద్దాం' అన్నాను. నాలో ఒకప్రక్క ఆనందం మరొక ప్రక్క తుఫాను చెలరేగింది. ఏది జయిస్తుందోనని నా మనస్సు ఎంత ఆందోళన చెందుతుందో ఎలా మీకు చెప్పాలో నాకు అర్థం కావడం లేదు. అంతా భగవదేచ్ఛ అని భగవద్గీతలోని 'సర్వధర్మాన్ పరిత్యజ్య...' శ్లోకం చదివి మేను ప్రక్కకు జేర్చాను.

* * *

ఈరోజు నా భాగ్యాన్ని నిర్ణయించే రోజు. జీవితంలో మరువలేని రోజు. ఈ రోజు నా జీవితంలో అమూల్యమైన రోజు. నిర్ణయం ఎలా జరుగుతుందో ఈరోజుదే భారం. మంచి - చెడూ రెండూ ఈ రోజువే.

నేను ఉక్కొ మూసాబె ఆయనకోసం ఎదురుచూస్తున్నాను. శ్రావణ మేఘాలు చెదురు చెదురుగా ఆకాశాన్నలముకొని ఉన్నాయి. సూర్యుడు నేడు తన కిరణాలలో ఏదో స్ఫూర్తిని జొప్పిస్తున్నాడు. ఆ కిరణాలు వింత వింత కాంతులను వెదజల్లుతున్నాయి. ఎందువల్లో అంతా నాకు ఆశ్చర్యంగా ఉన్నది. ఇంద్రధనస్సు విరబూస్తూ తన సోయగాన్ని చూచుకొని ఆనందిస్తున్నది. చక్కటి ప్రశాంత వాతావరణం నాకు శుభసూచకంగా అగుపించింది. ఇంతకంటె శుభమేం కావాలి నా జీవితంలో. తిరిగి వాడిపోయిన నా జీవితం పుష్పిస్తుంది,.. ఫలిస్తుంది. ఇవే ఊహలలో కొట్టుమిట్టాడుతున్నాన్నేను. ఇంతలో ఆయన వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించబడిన నా గదికి ఆయన్నాహ్వానించాను. ఆయన చిరునవ్వుతో నా స్వాగతాన్ని అందుకున్నారు. నేను ఫలహారం, కాఫీ తీసుకొని ట్రేతో సహా ఆయనదగరకెళ్లాను. 'మా ఇల్లెలా

ఫోన్ నెం 466

శ్రీ లక్ష్మీ కాఫీ అండ్ జనరల్ స్టోర్సు

బీసెంటు రోడ్ — విజయవాడ. 2.

ప్యాన్సీ, కిరాణా, కాఫీగింజలు, టోకుగాను, చిల్లరగాను పెదబజారు ధరలకే విక్రయించబడును.

మాచే నీలగిరి గింజలతో తయారుచేయబడిన

లక్ష్మీ బ్రాండ్ కాఫీపొడిని ఎల్లప్పుడూ వాడి ఆనందించండి.

ఆర్డరుపై కాఫీపొడి సీలుచేయబడిన టిన్నులో ప్యాకింగుచేసి పంపగలము.

'NVKR' Advtg.

వుంది...? నేను ఆయన్నే మనసులో తోచక వేసిన ప్రశ్న.

'బాగానే వుంది. ఆడవారు తిరిగే ఏ ఇల్లయినా కలకలలాడుతూ వుంటుంది' నా ప్రశ్నకు ఆయన జవాబు.

'ఫలహారం తీసుకోండి' నేను సిగ్గుతో అన్నాను ట్రే డ్రాయరుపై పెట్టి ప్రక్కగా నుంచున్నాను.

'ఇలా రా మనిద్దరం తీసుకొందాం అంత సిగ్గయితే ఎట్లా' ఆయన నన్ను పిలచారు.

నేను ఆయన ఆజ్ఞను శిరసావహించడాని కుద్యుక్తురాలనైయాను. ఇంతలో అమ్మ నన్ను పిలిచింది. హడావిడిగా నన్ను వంటింట్లోకి తీసుకువెళ్లి అన్నది. 'ఇదేం బాగాలేదు.' ఇతనే నిన్ను కట్నం లేకుండా చేసుకోబోయే వాడు. కానీ కాదన్న ఆయన ఈ విషయం తెలిస్తే సమ్మతిస్తారో అంగీకరించరు. ప్రశ్నార్థకంగా అమ్మ నా వైపు చూచింది.

అమ్మ ప్రశ్నకు నేను వెంటనే జవాబు చెప్పాను. 'నేనెంతో అదృష్టవంతురాలిని, ఏమైనా బెసగదు' అని నిశ్చలంగా అని మరింత ఉత్సాహంతో ఆయనదగ్గరకెళ్లాను. ఫలహార కాఫీల సేవ అయిపోయింది. 'మీ అమ్మగారేమన్నారు?' ఆయన అడిగారు. 'అంటాని కేంవుంది. మన ఇద్దరిష్టమే ఇష్టం కాని అసలు విషయం తెలిస్తే మీ రంగీకరించరేమో నని...'

'ఎంతమాట అలా ఎన్నటికీ జరుగదనిపోమీ నిస్తున్నాను. ఆయన నిశ్చలంగా అన్నారు.


"మీ రింతకాలము ఎందుకు వివాహం చేసుకోలేదు?" నేను అడిగాను.

"అదొక పెద్దగాథ–ఎందుకు చెప్పి బాధ పెట్టడం..." అని ఆయన ఒక దీర్ఘనిశ్వాసం విడిచారు.

"ఫరవాలేదు చెప్పండి. బాధ ఎందుకు?"

ఆయన ప్రారంభించారు :

"నా వివాహం చిన్న వయస్సులోనే అయింది. ఆమె ఎలా వుంటుందో నాకు తెలియదు. చాలా మంచిదని, అందం గలదని చెప్పగా విన్నాను. చిన్న వయసులో పెళ్లి పీటలమీదే చూచుకోవడమే. మళ్ళీ ఆమెను చూడలేకపోయాను. అప్పటో వాళ్లది మా ప్రక్క ఊరే. కొన్నాళ్లకు మళ్ళీ నాకు పెళ్లి ప్రయత్నాలు తలపెట్టారు. ఇదంతా నాకేమీ అర్థంకాక అడిగాను మా అమ్మా నాన్నను. అప్పటికినాకు కొంత ఆలోచించే శక్తి సామర్థ్యాలున్నాయి. కాలేజీలో చదువుతున్నాను. నాకు పెళ్లయింది గదా మళ్ళీ పెళ్లిప్రయత్నాలేమిటని అడిగాను. వాళ్ళు వివరంగా నాకు చెప్పలేదు. ఇతరుల వల్ల తెలుసుకున్నాను. కట్నం అనుకున్న ప్రకారం ఇవ్వలేక పోయారని, మా వివాహం అయినంతరువాత వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని విన్నాను. ఇంత మాత్రానికే లేచ్చుకున్న కోడలును, తలి



కట్టిన భార్యను దూరం చేయడానికి ప్రయత్నించారు మావారు. మావారి ప్రయత్నాలన్నీ ఫలించలేదు. వాళ్ల వివరాలు అడ్రసు తెలుసుకొంటే వారు ఇంకో ఊరు వెళ్ళిపోయారని తెలిసింది. నాకు మావాళ్ళ యెడ ఏహ్యభావం ఏర్పడింది. ఏ మాత్రం మానవత్వం లేనివారినిగా అనుకొన్నాను. ఎప్పటికప్పుడు వివాహం వద్దు వద్దు అని వారు తెచ్చిన సంబంధాలు కాదని, ఎలాగైతేనేం కాలేజీ చదువు పూర్తి చేసుకొని తరువాత ఉద్యోగంలో ప్రవేశించాను. ఇప్పుడు వాళ్ళు ఎక్కడ ఉన్నారో వివరం తెలియలేదు. ఎంతో ప్రయత్నించాను. కానీ ప్రయోజనం లేకపోయింది. ఎలాగయినా వాళ్ల వివరం తెలుసుకొని నా భార్యను తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేశాను. చివరకి ఒక నిర్ణయానికొచ్చాను. ఆమె ఇక నాకు దక్కదని వయస్సులో వున్న పిల్లకు వివాహం చేసి వుంటారనుకొన్నాను. అదంతా ఒక కలగా భావించాను. ఇక నిరీక్షించి ప్రయోజనం లేదని తలచాను. చాలాకాలం ఓపికతో ఆమెకోసం గాలించే ఈ నిర్ణయానికొచ్చా. ఇక ప్రయోజనం ఉండదనే నిశ్చయం నాలో నిలచింది.”

ఆయన సానునయంగా చెప్పుకుపోతుంటే నా కన్నీరు ధారలై ప్రవహించింది. ఆయన మెల్లగా తనదగ్గరకు తీసికొని నా కన్నీరు తుడిచి ‘కథ కన్నీరును తెపిస్తున్నదా’ అని కన్నీరు తుడిచారు. ‘నిజంగా నే ఎంత కరుణగాథ...గుర్తుకొస్తే నా హృదయం ఎంత బాధ పడుతుందో.’ ఆయన మళ్ళీ అన్నారు. కొన్ని క్షణాలాగి ‘మా వాళ్లకు హృదయాలు లేవు. డబ్బుయందు ఉండే ప్రేమ మనిషి మీద, తన కోడలుమీద లేదు. డబ్బుకు వాళ్లిచ్చే అంత లంకె. వాళ్ళ సర్వస్వమూ అదే. ఉన్నది చాలక ఆడపిల్లల తండ్రులను పీడించి పిప్పిచేయడం...ఆయన ఆవేశంతో అన్నారు.

వారి చేతులు నా చెక్కిళ్లను నిమురుతున్నాయి. నాలో ఉన్న ఆశ—భయం—ఏది జయిసుందో ఫలితంకోసం నా మనస్సు ఉర్రూతలూగిపోతున్నది. చెప్పలేక మెల్లగా తడబడుతున్న స్వరంతో అన్నాను. ‘ఆమె అడ్రసు తెలిపితే వెళ్తారా? నాకు తెలుసు.’

ఆయన స్తబ్దుడైపోయాడు. సందిగ్ధావస్థలో పడ్డాడు. ‘ఆఁ...నిజంగానా?’ అడిగాడు ఆయన.

ఆయనలోని ద్వంద్వయుద్ధం నాకు అర్థమయింది. నన్ను ప్రేమిస్తున్నానని మాట ఇచ్చాడు. ఇప్పుడు తాళి కట్టిన భార్య... ‘భగవాన్’ అనే మాటలు అప్రయత్నంగా ఆయన నోటినుండి వెలువడినయ్. అతనిదృష్టిలో నేను...తాళికట్టి ఎదురుచూచి నిరాశ పొందిన తరువాత ప్రత్యక్షమైన భార్య... ఇందులో ఎవరిని కాదనాలి, కాదనగలడు? అతనిలో తీవ్రసంఘర్షణ ప్రారంభమయింది. అలా ఎంతసేపు కూర్చున్నామో మౌనంగా తెలియదు. ఇక ఆయనను బాధపెట్టడం మంచిది కాదనుకున్నాను. ఆయన హృదయం నాకు పూర్తిగా అర్థమైంది. సున్నిత హృదయాన్ని గాయపరచడం మంచిది కాదనుకున్నాను. నాకు ఇదంతా ఒక కలగా సుందర దృశ్యాలుగా కనుపించింది. నాలో సిగ్గు దొంతరలు ముంచుకొస్తున్నాయ్. హాసరపాలు వెలువలె ప్రవహించాలని ప్రయత్నిస్తున్నాయ్. నాలోని తొందర ఇంక నన్ను నిబ్బరంలో ఉంచలేకపోయింది. ‘నేను మీ తాళికట్టిన భార్యను—అంతేగాక దారిలో చూచి ప్రేమింపబడిన దానను’ అని ఆయన ఒడిలో వాలిపోయాను.

ఒక్కసారిగా ఆయన మొహంలో అద్వితీయ కాంతి వెలసింది. ‘నిజంగానా’ అంటూ ఆయన బిగి కౌగిలిలో బిగించారు. ఆబిగి కౌగిలిలో నేను నా భాగ్యానికి ఉక్కిరిబిక్కిరి ఔతున్నాను. తలుపు చాటునుండి మా అమ్మ మమ్ములను చూచి ఆశీర్వదించి, ముసిముసి నవ్వులు చిందించి వెళ్లిపోయింది. సెంట్ క్వీన్ వాసనలు మమ్ము మత్తెక్కించాయ్. గగనాన చంద్రుడు తారలతో ఆడుతూ మమ్ములను చూపిస్తూ నవ్వుతున్నట్లున్నాడు. మేమిద్దరంఆనంద సాగరంలో అద్వితీయపారవశ్యంలో సాగిపోతున్నాం. ★

“పొలంనుండి”

—చిత్రకారుడు : యం. డి. నెల్సన్]